# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్య వాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగి నప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
J. C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 9 | జనవరి 1989 | సంచిక 6


## సంపాదకీయము

### మాసిదోనియ పిలుపు

### (*Macedonian Call*)

పౌలు సువార్త యాత్రను రెండోమారు జరుపుచుండగా అతడు, అతనితో యున్నవారు ఆసియలో వాక్యము చెప్పకూడదని పరిశుద్ధాత్మ వారి నాటంకపరచెను. వారు ఫ్రుగియ, గలతీయ ప్రదేశముల ద్వారా వెళ్ళిరి. ముసియ దగ్గరకు వచ్చి బితూనియకు వెళ్లుటకు ప్రయత్నము చేసిరి. వారు ముసియను దాటిపోయి త్రోయకు వచ్చిరి. అప్పుడు మాసిదోనియ దేశస్థుడొకడు నిలిచి - నీవు మాసిదోనియకు వచ్చి మాకు సహాయము చేయుమని తనను వేడుకొనుచున్నట్లు రాత్రివేళ పౌలుకు దర్శనము కలిగెను (అపొ. కా. 16:6-9).

ఈ దర్శనము కలిగినందున వారు వెంటనే మాసిదోనియకు బయలుదేరుటకు ప్రయత్నము చేసిరి. ఏలయనగా వారికి సువార్త ప్రకటించుటకు దేవుడు వారిని పిలిచెనని వారు గ్రహించారు (అపొ. కా. 16:10). కాబట్టి వారు త్రోయను విడిచి ఓడ ఎక్కి తిన్నగా

సమొత్రాకేకును, నెయపొలికిని తరువాత మాసిదోనియ ప్రాంతములకు ముఖ్యపట్టణమైన ఫిలిప్పీకిని వచ్చారు.

వారు ఆసియాలో వాక్యము చెప్పకూడదని ఆత్మ వారినెందుకు ఆటంకపరచెను? మాసిదోనియ మనుష్యుడు వారి దగ్గరకు వచ్చి సువార్త ప్రకటించుమని పౌలు నెందుకు వేడుకొన్నాడు? నిజానికి యితర ప్రాంతాలలో సువార్త ప్రకటించబడింది గాని మాసిదోనియలో ప్రకటింపబడలేదు. కనుక మాసిదోనియలో అది అవుసరమై యుండెను. మరల సువార్తకు విధేయులయ్యేవారు అక్కడ ఉండిరి.

మనము ముందుకు చదువగా, పౌలు లూదియను ఆమె యింటి వారిని కనుగొని వారికి దేవుని వాక్యము బోధించగా వారు ప్రభువుకు విధేయులైనట్లు తెలిసికోగలము.

తరువాత పౌలు సోదెచెప్పు ఒక చిన్నదానిని స్వస్థపరచాడు. ఆమె ద్వారా లాభము సంపాదించుకొనుచున్నవారు పెద్ద గందరగోళము లేవదీసారు. పౌలు సీలాలు చెరసాలలో వేయబడ్డారు. మధ్య రాత్రివేళ పౌలు సీలాలు పాటలు పాడుచుండిరి, ప్రార్థన చేయుచుండిరి. అప్పుడొక భూకంపము కూడ కలిగెను. మరియు వారు విడుదల చేయబడిరి. ఖైదీలందరు పారిపోయారనుకొని చెరసాల అధిపతి కత్తిదూసి తన్ను తాను చంపుకొనబోయాడు. అయితే మేమందరము ఇక్కడనే యున్నాము కనుక నీవు ఏ హానియు చేసికొనవద్దని పౌలు బిగ్గరగా అరచాడు. అప్పుడు రక్షణ పొందుటకు నేనేమి చేయాలి అని అతడు పౌలునడిగాడు. వారు అతనికి అతని యింటివారికి సువార్త వాక్యమును బోధించారు. చెరసాల అధిపతి వారిని తీసికొని వారి గాయములు కడిగి రాత్రి ఆ గడియలోనే తానును తన యింటివారును బాప్తిస్మము పొందారు.

పౌలు మాసిదోనియవాని పిలుపు నంగీకరించినందున రెండు

కుటుంబములవారు క్రీస్తు నంగీకరించారు మరియు ఆ ప్రాంతములో క్రీస్తుసంఘము స్థాపించబడింది. తరువాత పౌలు ఫిలిప్పయి సంఘానికొక పత్రికను వ్రాస్తూ ఆ సంఘ పెద్దలు పరిచారకులను గూర్చి చెబుతాడు. అంటే అక్కడి సంఘము దినదినాభివృద్ధి చెందుచుండెను, మరియు పౌలు వారియెడల పూర్ణమైన నమ్మకము కలిగి యుండెను.

మాసిదోనియకు వచ్చి సువార్త ప్రకటించవలెనని పౌలు దర్శనములో చూచినను, పౌలు అక్కడకు వెళ్ళి సువార్త ప్రకటించిన తరువాతనే అక్కడివారు ప్రభువుకు లోబడ్డారు. అయితే దర్శనములో కనబడిన మనుష్యుడే ఈ పని ఎందుకు చేయలేదు? సువార్త మంటిఘటములైన మానవుల కియ్యబడింది. దాన్ని ప్రకటించే బాధ్యత మానవులదే.

అయితే నేడు ప్రభువు మనకు దర్శనముల నిచ్చుటలేదు, మనల్ని నడిపించుటకు దేవదూతలను పంపుటలేదు, లేదా ఫలానిచోటకు వచ్చి సువార్త ప్రకటించుమని ఎవరు దర్శనముద్వారా మనలను అడుగుటలేదు. అయితే అనేక ప్రాంతములనుండి "మాసిదోనియ పిలుపు" మనకు వచ్చుచునే యున్నది. వారు బైబిలు కరస్పాండెన్సు పాఠములను, సువార్త పుస్తకములను అడుగుతారు. ఎవరినైనా బోధకుని తమ యొద్దకు పంపుమని అడుగుతారు. వారు వచ్చి సత్యవాక్యము వినిపించాలని, బాప్తిస్మము ఇయ్యాలని, క్రీస్తుసంఘాన్ని వారి ప్రాంతములో నాటాలని అడుగుతారు. ప్రశ్న యేమంటే - ఇట్టి పిలుపును మనము మన్నించెదమా? మనం వెళ్లెదమా? ఎవరినైనా పంపెదమా? మనం వెళ్లకపోతే యేమి జరుగుతాది? దానికి ఎవరు బాధ్యులవుతారు? ప్రభువు సంతోషిస్తాడా?

సర్వలోకానికి సువార్త ప్రకటించాలని ప్రభువు మనకు ఆజ్ఞాపించాడు. ఈ గొప్ప ఆజ్ఞను నెరవేర్చుటకు మనకు అన్ని రకాలైన తరుణములు ఇయ్యబడ్డాయి. మనం ఎవరినీ బలవంతము చేయనక్క

స్లేదు. ఇంటింటా, ప్రపంచమంతటా సువార్త ప్రకటించుతరుణము లనేకములున్నాయి. అట్టి పిలుపును మనము పొందియు దానిని నిర్లక్ష్యం చేయడం విచారకరం. పౌలుకు మాసిదోనియ నుండి పిలుపువస్తే అతడు దాన్ని నిర్లక్ష్యం చేసియుంటే ప్రభువు ఏమి తలంచియుండును? దీని జవాబును నీవు ఎరిగే యుందువు. నీవు మంచిహృదయం కలిగిన వాడవైతే సువార్త ప్రకటించే పిలుపుకు లోబడ్తావు. సువార్త వెలుగును పంపు దేవా అని పాడుటకాదు, ప్రార్థించుట మాత్రమే కాదు సువార్త వెలుగును నీవే యితరులకు చూపించాలి. ఏ అనివార్య కారణంవలనైనా నీవు వెళ్లలేకపోతే నీ స్థానంలో ఎవరినైనా పంపించాలి. అట్లు చేయగలిగితే ఈ లోకం అంతటా సువార్త వ్యాప్తి జెందుతాది.

---

## నూతన సృష్టి

మట్టిలోన మణులెన్నో దాగియుండుట సహజమేలే
మట్టిలోతు త్రవ్వకొలది ఖనిజగనులుండునులే
మట్టి మనిషి మహిమ రూపు దాల్చునుట నిజమేలే
మట్టికూడ సృష్టికర్త మాట వినక మారదులే!

ఏ రాపిడి లేకుండా వజ్రమెలా మెరుస్తుంది ?
ఏ ఒత్తిడి లేకుండా సంద్రమెలా పొంగుతుంది ?
ఏ ప్రక్రియ లేకుండా బండరాయి పగులుతుందా ?
ఏ చేతన లేకుండా హృదయము స్పందిస్తుందా ?

ముడి వజ్రపు కొత్తరూపు సానవల్లే వస్తుంది
కడలి అలల కదలికలు గాలివల్లే వస్తాయి
మంది మందు ఉన్నప్పుడే కొంత పిండి అవుతుంది
క్రీస్తువార్త వినికిడిలో క్రైస్తవ్యం పుడుతుంది!

పాత యేడు గడిచాకే క్రొత్తయేడు వస్తూంది
పాత (రోత) బ్రతుకు పాతరేస్తే క్రొత్త జన్మ వస్తూంది
నీతి రహిత బాటసార్లు క్రీస్తు వెలుగు చూడాలి
క్రొత్త సృష్టి క్రీస్తులోనే అనుభవమ్ము తెలియాలి !

(II కొరింథి 5:17)

—సామ్యూల్ జాన్ మేడిది, కొణితివాడ.

---

## ఇంతవరకు యెహోవా మనకు సహాయము చేసెను

(1 సమూయేలు 7:12)

ఇంతవరకు అన్న మాట గతాన్ని సూచిస్తున్నది. ఇంతవరకు న జీవితయాత్రలో పేదరికములో ఐశ్వర్యములో అనారోగ్య లో, ఆరోగ్యములో, ఇంటిలో, బయట, దూరప్రాంతములలో, దేశాలలో, నేలమీద, నీటిలో, గౌరవము కలిగినపుడు అగౌరవము గినపుడు, దుఃఖములో, సంతోషములో, శ్రమలలో, విజయము , అపజయములలో, శోధనలలో, వేదనలలో, మన ప్రార్థనలలో డు మనకు సహాయం చేసాడు.

ఇంతవరకు అనే మాట భవిష్యత్తును కూడ సూచిస్తున్నట్లున్నది, దుకనగా ఇంతవరకు అనే మాటను బట్టి మన గమ్యాన్ని మనము ట్ట లేదు. గమ్యాన్ని చేరుటకు మనము యింకా ఎన్ని శ్రమలు, నలు, దుఃఖములు, శోధనలు, బాధలు, విజయములు, ఆనందము - యెన్నెన్ని పొందాలో తెలియదు. ఇంతవరకు యెహోవా సహాయము చేసి ఈ నూతన వత్సరాన్ని మనకు దీవెనగా గ్రహించాడు. ఇది మన ముందుంచబడింది. మీరు నది దాటి

స్వాధీనపరచుకొనుటకు వెళ్ళుచున్న దేశము కొండలు, లోయలు గల దేశము. అది ఆకాశ వర్ష జలము త్రాగును. అది నీ దేవుడైన యెహోవా లక్ష్యపెట్టు దేశము. నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు దాని మీద ఉండును (ద్వితీ 11:11-12).

కనుక చదువరీ! అధైర్యపడకుము. దేవునికి నీ హృదయమును సమర్పించుకొని, ఆయనను స్తుతించుము. బలహీనత, వార్ధక్యము, రోగము, మరణములతో మానవ చరిత్ర అంతముకాదు. క్రీస్తుయొక్క సారూప్యములోనికి మార్చబడి, ధవళ వస్త్రములు ధరించి, పరిశుద్ధులందరితో కలసి, స్తోత్రగీతములు పాడుచూయుండే నిత్యజీవములోనికి ప్రవేశించాలి. కనుక నిబ్బరము కలిగి ధైర్యముగా నుండుము. నీ హృదయాన్ని ఆ నిజదేవునికి సమర్పించుము. ఇంతవరకు సహాయం చేసిన దేవుడు ఇకముందును సహాయంచేసి నిన్ను నడిపిస్తాడు, పోషిస్తాడు, దీవిస్తాడు, జీవింపజేస్తాడు.

కనుక నీవు యెవరిని సేవింపకోరుచున్నావు? మీ రెవరిని సేవింపకోరినను నేనును నాయింటివారును యెహోవానే సేవించెదము (యెహోషువ 24:15).

అట్లు చేయుటకు దేవుడు మీకు సహాయము చేయునుగాక.

—జెస్సీ జేసన్, కాకినాడ.

# సార్వత్రిక యాజకత్వ మననేమి?

## (What is the Universal Priesthood ?)

(I పేతురు 2:5, 9)

(ఒక సందర్భమున జాతీయ, అంతర్జాతీయ వేదవాక్యకోవిదుల సభలో సంక్షిప్తముగా యిచ్చిన ఉపన్యాసమును "సత్యవాక్య" పత్రికాశకుల కోరికపై నేనీ వ్యాసమును ఆంధ్రమున సమకూర్చితిని.)

ఈ అంశమును క్షుణ్ణముగా పరిశీలించుటకుగాను మూడు భాగములుగా విభజించుకొందము :

1. విశ్వాసు లందరు యాజకులా ?

2. యాజకుని విధి యేమి ?

3. యాజకుని పోషణ యెట్లు ?

**1. యాజకుడెవరు?:**—యాజకత్వమనే అంశమే యొంత జటిలమైన సమస్య. క్రైస్తవేతరులలో యాజకుడనే పదము "పూజారి" యను రూపమున వాడబడుచున్నది. క్రైస్తవేతరులలో పూజారులని పిలువబడువారు సామాన్య మానవులకంటె అతీతులనియు, పవిత్రులనియు, దైవ సాన్నిధ్య సంచరులనియు ఊహించబడి ప్రత్యేకమైన ఉన్నత అంతస్తులో యున్నవారిగా పరిగణింపబడుచున్నారు. అది యట్లుండ క్రైస్తవులమని పిలిపించుకొనుచున్న కొన్ని మతశాఖలవారుకూడా ఇదే విధముగా యాజకులు (Priests) ఒక ప్రత్యేకమైన అంతస్తుకు చెందినవారనియు, తదితర క్రైస్తవులకంటే శ్రేష్ఠులనియు, దేవుని ప్రతినిధులనియు పిలిపించుకొనుచున్నారు. ఇది సమంజసమా! దేవుడు పక్షపాతి కాడు.

యాజకుడనగా అర్థమేమి? మధ్యవర్తి, లేక వర్తమానికుడు అని వేదవాక్య నిఘంటువు చెప్పుచున్నది. వెబ్‌స్టర్ నవవిశ్వ నిఘంటువేమని నిర్వచించుచున్నదంటే "యాజకుడు అనగా 'దైవమునకును, ఆరాధించువానికి మధ్య వ్యవహరించువాడు." ఈ నిర్వచనము లేఖనము నందు మొదటి తిమోతి 2:5 లో చెప్పబడిన వాక్యమునకు సూటిగా నున్నది. "దేవునికిని, నరులకును మధ్యవర్తి ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు". క్రీస్తు యేసు ప్రధాన యాజకుడై యుండి దేవునికిని నరులకును మధ్య వ్యవహరించుచున్నాడు. ఈ సందర్భములో చదువరుల కొక సందేహ ముద్భవించవచ్చును. ప్రవక్త కూడ దేవుని యొద్దనుండి వర్తమానము తీసుకొని వచ్చి మానవుల కందించును గదా అయినట్లయితే ప్రవక్తయును, యాజకుడును ఒకరేనా? ప్రవక్తయును, యాజకుడును దేవునికిని మానవులకును మధ్య వ్యవహరించువారై నప్పటికిని వారి మధ్య చాలా వ్యత్యాసమున్నది. ప్రవక్త మానవాతీతమైన భూత, భవిష్యత్వర్తమాన కాల సంభవముల నెరుగు జ్ఞానము పొంది దేవుని యొద్దనుండి వర్తమానమును తీసుకొని వచ్చి మానవులకందించును, కాని మానవుల పక్షముగా దేవుని యొద్ద వాదించబద్ధుడు కాదు. యోనా ప్రవక్త నీనెవే పట్టణస్థుల యెడల ప్రవర్తించిన ప్రవర్తనయే దీనికి సాదృశ్యము (యోనా 3:4). యాజకుడైతే దేవుని యొద్దనుండి వర్తమానము తీసుకొని వచ్చి మానవుల కందించి, తిరిగి మానవుల యొద్దనుండి దేవుని సమ్మతి పరచుటకు అర్పణరూపముననో లేక మాట రూపముననో జవాబు తీసుకొనిపోవును. మోషే ఇశ్రాయేలీయుల మధ్య చేసిన కార్యములు యాజక ధర్మమునకు దీటైయున్నవి. మోషే యాజకుడు (దా. కీ. 99:6).

పితరుల కాలములో యెహోవా దేవుని శాంత పరచుటకు కుటుంబ యజమానులు బలుల నర్పించుచుండిరి. కుటుంబ సభ్యుల యతిక్రమముల నిమిత్తము యజమానుడు బలుల నర్పించి దేవునికిని

మానవులకును మధ్య వ్యవహరించుచుండెడివాడు. యోబు తన బిడ్డల యతిక్రియముల నిమిత్తము దిన దినము బలుల నర్పించెడివాడు (యోబు 1:5). యోబు చేసిన కార్యములు ఆకాలపు ఆచారములకు తార్కాణముగా యున్నవి. నోవహు బలుల నర్పించెను. అబ్రాహాము, యాకోబు మొదలైన పితామహులు బలుల నర్పించుచుండెడివారు. అయితే మోషే క్రమము ప్రవేశపెట్టబడినది గనుక పితరుల ఆచారము రద్దు అయ్యెను. ఒకే ఒక వంశీయులు అనగా లేవీయులు మాత్రమే యాజకులుగా యుండి తన యింటిలో సేవచేయవలెనని యెహోవా దేవుడు నిర్ణయించెను. అహరోను అతని కుమారులు యాజకులుగా మోషే క్రమములో మొట్టమొదటిసారిగ ప్రతిష్టించబడిరి (నిర్గమ 28). మానవుని సృజించి, వానితో ముఖాముఖిగా మాట్లాడుచుండిన దేవుడు మానవుడు మహిమను కోల్పోయిన తదుపరి మానవునితో మాట్లాడుటకు మధ్యవర్తిని నియమించెను. ఈ మధ్యవర్తిని నియమించుట దేవుని యొక్క అనంత జ్ఞానమును ఋజువు చేయుచున్నది. దేవుడు తాను నీతిమత్త్వము గలవాడనని యొప్పించుకొనుటకుగాను పాపనిమగ్నుడైన మానవునకు దూరమాయెను గాని పాపి యెడల తనకున్న ప్రేమను విరుచుకొనలేక, తిరిగి వానికి శుద్ధీకరించి తన చెంత చేర్చుకొనవలెనన్న యాశతో మధ్యవర్తిని నియమించెను. యాజకత్వము లేక మధ్యవర్తిత్వము క్రీస్తులో నిమజ్ఞమాయెను. "ఆహా! దేవుని బుద్ధిజ్ఞానముల బాహుళ్యము యెంతో గంభీరము" (రోమా 11:33). మోషే క్రమము దిద్దుబాటు కాలము వచ్చు పర్యంతము కొనసాగెను (హెబ్రీ 9:10). కృపాయుగము క్రీస్తుతో ప్రారంభమాయెను. "కృపయు, సత్యమును యేసుక్రీస్తుద్వారా కలిగెను" (యోహాను 1:17). దిద్దుబాటు శుక్లపక్షజాబిల్లి వలే కల్వరిగిరిపై పూర్ణ చంద్రరూపము దాల్చెను. దానితో ప్రవేశించెనొక నూతన నిబంధన; మోషే క్రమముడిగె. శ్రేష్టమైన మెల్కీసెదకు క్రమము క్రీస్తునందు ప్రవేశించెను (హెబ్రీ 5:6, 10).

శ్రేష్టమైన నిబంధన, శ్రేష్టమైన యాజకత్వము, శ్రేష్టమైన నియమము అనగా క్రీస్తు యేసునందు జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము ప్రవేశపెట్టబడెను. నూతన నియమమునందు యేసుక్రీస్తు ప్రధాన యాజకుడు, యేసుక్రీస్తు నరులకును దేవునికిని మధ్య మధ్యవర్తి యాయెను. ఈ శ్రేష్టమైన నూతన నియమములో పాపవిమోచనా ప్రణాళిక కుదించబడియున్నది. అతి సులువైన సూత్రములు పాప విమోచనా ప్రణాళికలో యిమడ్చబడి యున్నవి.

1) క్రీస్తు వాక్యమును వినుము
2) క్రీస్తు నీ పాపములనుండి విడిపించుటకు చనిపోయెనన్న వాక్యమును నమ్ముము
3) పశ్చాత్తాప పడుము
4) యేసు నీ ప్రభువు అని ఒప్పుకొనుము

5) పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అంతే "విముక్తి పొందావు". ఇప్పుడు క్రొత్త సృష్టి, క్రీస్తు యేసును ధరించుకున్నావు. (గలతీ 3:27). తండ్రితోనూ క్రీస్తుతోనూ నీవు యేకమై యుండవలెనని క్రీస్తు ప్రార్థన చేయుచున్నాడు (యోహాను 17:21). క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినవారు ఆయన మరణములో పాలు పొందియున్నారు. పునరుత్థానములో ఐక్యత కల్గియున్నారు (రోమా 6:3-5). క్రీస్తు యేసుయొక్క నానావిధ గుణ సంపన్నతలో యాజకత్వము ఒక భాగము. క్రీస్తు యేసుయొక్క జీవపుటాత్మ నియమములో పాలిభాగస్తుడవయిన నీవు ఓ విశ్వాసీ క్రీస్తు యేసులో ఒక గుణలక్షణమైన యాజక లక్షణములలో పాలివాడవు కావా? ఆయనను ధరించుకున్న నీవు ఆయన యాజకత్వమును ధరించుకొనలేదనగలవా? అందువలననే పేతురు మహాశయుడు పొంతు, గలతీయ, కప్పదొకియ, ఆసియ, బితూనియ మొదలగు ప్రదేశము

లలో చెదరియున్న విశ్వాసు లందరు పరిశుద్ధ యాజక సమూహమని పిలుచుచున్నాడు (1 పేతురు 1:1; 2:5). క్రీస్తు రక్తముతో ప్రోక్షింపబడి, అన్యదేశములలో చెదరియున్న విశ్వాసులు యాజక సమూహమై యుండగా అదే రక్తముతో ప్రోక్షింపబడి యేసుక్రీస్తును ధరించుకొనిన నీవు యాజకుడవు కావా? కృపవలననే నీకీ ఆధిక్యత లభించినది. చదువరీ! నీవుకూడా ఆ ప్రేమమూర్తి రక్తములో ప్రోక్షింపబడినవాడవైతే నీవుకూడ యాజకుడవే! ఇట్టి అనుభవము నీకు లేనియెడల ప్రభువు ప్రేమ, ఓ ప్రియుడా, నిన్ను నిర్బంధించును గాక!

2. యాజకుని విధి యేమి:—విశ్వాసు లందరూ యాజకులని పిలువబడుచున్నారని నిరూపించబడినది. యాజకుడు లేక విశ్వాసియైన వానికి దేవునితో తనకున్న సన్నిహిత సంబంధమును బట్టి ప్రభువు ఆయనకు తగు తలాంతులను గ్రహించును. యాజకుడను పదమునకు వర్తమానికుడను యర్థమున్నదని ముందే మనవి చేసుకొంటిని. పేతురు తన మొదటి పత్రిక రెండవ అధ్యాయము తొమ్మిదవ వచనములో యాజకుడు చేయవలసిన విధిని సూచించియున్నాడు. "చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురము చేయు" వారని చెప్పుచున్నాడు. యాజకులను వారు ప్రచురణకర్తలని దీనిని బట్టి మనము తెలిసికొనగలము. అయితే ప్రచురించవలసిన వర్తమాన మేమి? "నాకియ్యబడిన ఉపదేశము మొదట మీకు అప్పగించితిని. అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథి 15:3, 4). ఆయన యిచ్చిన యీ వర్తమానము నమ్మకముగా లోకమునకు అందించుటయే ప్రభువును ఘనపరచుట, మన రక్షకుని స్తుతించుట. నేను హింసకుడను, దూషకుడను, వశీకరుడను

అయినను కనికరింపబడితిని అని చెప్పి అపొస్తలుడైన పౌలు చేయు పని యిదియే! నేను శిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాను. సువార్త ప్రకటించకపోయినట్లయితే శ్రమ అని భావించుచున్నాడు. గ్రీసు దేశస్తులకును యితరులకును ఋణస్థుడనని చెప్పుచున్నాడు. ప్రవిమోచింపబడిన క్రైస్తవునకు యీ బాధ్యత యున్నది. "సువార్త ప్రకటింపవలసిన భారము నా మీద మోపబడియున్నది" అని పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథి 9:16). ప్రభువైన యేసు కూడా తాను ఆరోహణ కాలమున" మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులుగా చేయండి...నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించండి" (మత్తయి 28:19, 20). అని ఆజ్ఞాపించి యున్నాడు. పౌలు యీ బాధ్యత నెరవేర్చి ప్రభువును ఘనపరచియున్నాడు. ప్రతి క్రైస్తవుడు తన రక్షణకర్తయగు క్రీస్తును ప్రకటించుటయే ఆయన గుణాతిశయములను ప్రచురించుట. ఓ క్రైస్తవా! నీ బాధ్యతలను గుర్తించితివా!

**3. యాజకుని పోషణ యెట్లు :-** జ్ఞానసంపన్నుడగు ప్రభువు తన సేవచేయు దాసుల యవసరతలు యెరుగనివాడు కాదు. పూర్వమందే తన మందిర సేవచేయు యాజకుల పోషణ నిమిత్తము తగు సూచనలు లేఖనములయందు పొందుపర్చి యున్నాడు. ఇశ్రాయేలు ప్రజలు వారి రాబడి యంతటనుండియు దశమ భాగమును దేవుని యింటికి తీసికొని రావలెననియు, ఇందులో పదియవ భాగము యాజకుడు తన పోషణ నిమిత్తము తీసుకొనవలెననియు కట్టడ నియమించి యున్నాడు (సంఖ్యా 18:26-31). దిద్దుబాటు కాలమున క్రైస్తవుడు మోషే క్రమమునుండి విడుదల పొందియున్నాడు (రోమా 7:6). అయితే అంతకంటె శ్రేష్టమైన నియమము ప్రవేశపెట్టబడినది. దేవుని యింటి కార్యములు సక్రమముగా జరుగుటకుగాను (ప్రతి విశ్వాసి తాను వర్ధిల్లినకొలది ప్రతి ఆదివారము చందా సమకూర్చ

వలెను (1 కొరింథి 16:1-2). సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయునని హెచ్చరింపబడియున్నాడు (2 కొరింథి 9:6,7). దేవుని యింటికి యీ విధముగా క్రైస్తవుడు కానుకలు తీసుకురావలెనని హెచ్చరికయై యున్నది. ఆలయ కృత్యములు జరిగించువారు ఆలయము వలన జీవనము చేయుచున్నారనియు, సువార్త ప్రచురించువారు సువార్త వలన జీవింపవలెననియు ప్రభువు నియమించియున్నాడు (1 కొరింథి 9:13, 14). కళ్లము త్రొక్కుచున్న యెద్దు మూతికి చిక్కము పెట్టవద్దని గ్రంథము చెప్పుచున్నది (1 కొరింథి 9:9). సువార్త ప్రచురించువాని కొరకే గదా యీ నియమములు నిర్ణయించబడియున్నవి. ఈ ఫలములు అనుభవించుటకు సువార్తకునికి అధికారమున్నదని లేఖనములు విశదపరచుచున్నవి గాన క్రీస్తును ప్రేమించు సంఘములు తమ సంఘములలో క్రీస్తును బట్టి ప్రయాసపడు సేవకుల నైతిక భారమును వహించుట తగియున్నది. ఈ సందర్భమున భారత క్రైస్తవాళిని మెచ్చుకొనదగిన కారణమొకటి కలదు. భారతదేశ క్రైస్తవులెంత పేదలైనను సువార్త సేవ చేయువానిని విత్యాకారరహితముగా ఆదరించి తృణమో, పణమో ముట్టజెప్పే దయార్ద్ర హృదయులు. భారతీయుల యొక్క ఔదార్యము అంతర్జాతీయుల ఆవరణలో మూరుమ్రోగుచున్నదనుటకు సందేహము లేదు. ఈ విషయములో వారి పక్షమున దేవుని కెంతయో కృతజ్ఞతలర్పించుచున్నాను. అయినను దేవుని యింటి సేవకొరకు క్రమ బద్ధముగా యిచ్చు విషయములో అనేకులకు తగు లేఖన జ్ఞానము కొరతపడియుండుట విచారకరము. సంఘ నాయకులు లేక సువార్త యను ఘనమైన పరిచర్యకొరకు నియమితులైనవారు యీ విషయమును గూర్చి సంఘమును యిచ్చుట విషయములో జ్ఞానయుక్తముగా లేఖనముల ప్రకారము హెచ్చరించుట ఉచితము. ఇది చాల సున్నితమైన విషయము (డెలికేట్ మేటర్) కాని చెప్పక తప్పని అంశము

ఈ విషయము తప్పక చెప్పవలసినది కదా యని సువార్తికుడు వేగిర
పడి లేఖనములనుండి మలాకి 3వ అధ్యాయము, రెండవ కొరింథి
తొమ్మిదవ అధ్యాయము తీసికొని సంఘమును ఉద్రిక్తపరచమని
కాదు నా యుద్దేశ్యము. సమయోచితముగా పలుకబడిన మాట
చిత్రమైన వెండి పళ్లెములలో నుంచబడిన బంగారు పండ్లవంటిది
(సామెతలు 25:11). గాన సువార్తికుడు సంఘముయొక్క వాతా
వరణమును గుర్తించి జ్ఞానయుక్తముగా యిచ్చుట విషయములో
ఉద్దేశించినచో శ్రేష్టమైన ఫలితములను కోయగలడన్న భావము
అనుభవపూర్వకముగా నాకు కలదు. సందేహం లేదు. దేవుని యింటి
కార్యములు సక్రమముగా జరుగుటకు సంఘము తీసుకొనవలసిన
బాధ్యతను నిస్వార్థముగా లేఖనములను బట్టి ప్రేమతో యెరుక
చేయుట సువార్తికుని కర్తవ్యమై యున్నది. సంఘము వాక్యమునకు
తలవొంచి సంఘ బాధ్యతలను గుర్తించి యిచ్చుట విషయములో
కూడా అనింద్యులుగా యుండుట కోరదగినది. వాక్యమందును, ఉప
దేశమందును ప్రయాస పడువారిని రెట్టింపు సన్మానమునకు పాత్రు
లనుగా యెంచి (1 తిమోతి 5:17) వారి బాధ్యతలను వహించి వారి
సంఘ ఉపదేశకుని వారే పోషించుకొనుచున్నారని చెప్పుకొను ఘనత
సంఘస్థులు దక్కించుకొనుట ఆనందదాయకము. ఆయా సమయము
లందు సంఘమునకు వెలుపలనున్న వ్యక్తులద్వారా గాని, దూరమం
దున్న సంఘములద్వారా గాని పంపబడిన కానుకలు సంఘ సేవకుడు
అంగీకరించుట లేఖన విరుద్ధము కాదు. అపొస్తలుడైన పౌలు రోమా
పట్టణములో యుండగా ఫిలిప్పీయులోనున్న సంఘము ఆయనకు పంపిన
వస్తువులు యెంతో మనోహరమైనవని చెప్పుచున్నాడు (ఫిలిప్పీ 4:15-18).
ఇట్టి ఉపకారములో పాలి భాగస్థులు దేవుని ఆశీసులకు పాత్రులగుదురు.
అయితే యెప్పుడో ఒకసారి, యెవరో యొక దయామయులు పంపు నిల
కడలేని కానుకలపై సేవకుడు ఆధారపడియుండుట మేఘములపై

ఆధారపడిన చందనమున యుండును. అందుచేత సంఘము తన ఉపదేశకుని నిలుకడగా పోషించుకొను బాధ్యత వహించుట భాగ్యము. ఉపదేశకుడు కూడా తాను సంఘముపై అధిక భారముగా యుండకుండ చూచుకొనుట లేఖన హెచ్చరిక (2 కొరింథి 12:16). చివరిగా, ప్రియులారా! ఇట్టి విధముగా సంఘములలో ప్రేమ విస్తరింపవలెననియు, ఉపదేశికులు దుఃఖితులుగాక సంతోష, సంతృప్తులుగా సేవ చేయుచు ప్రభువుకు మహిమ తీసుకొనువచ్చు పాత్రులుగా యుండవలెననియు ప్రభువు నందు ఆశించుచున్నాను.

1. సార్వత్రిక విశ్వాసుల యాజకత్వము లేఖన వరము
2. యాజక ధర్మము ఘనమైనది
3. యాజకుని పోషణ విధానము దైవ నిర్ణయముతో కూడినది.

—D.L. హెన్రీ, విశాఖపట్టణము.

అద్వితీయుని ఆరాధించుటకు గొప్ప అవకాశము

చక్కని భావభరితమైన, శ్రావ్యమైన సంగీతములు గల అందమైన ప్రింటింగుతో 284 పాత క్రొత్త క్రైస్తవ కీర్తనలు గల పుస్తకములు సిద్ధపరచబడి యున్నవి. మీ కుటుంబములోను, సంఘములోను ప్రభువును స్తుతించుటకు తగియున్నవి. పుస్తకము ఖరీదు 6-00 రూ॥లు. పోస్టల్ చార్జి 0-50 పై॥లు అదనం. డబ్బు పంపినవారికి అందజేయగలము.

వలయువారు ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి.

CHURCH OF CHRIST
C/o T. Prakasa Rao
Gopalunipalli, (via) KOMAROLE-523 373

# బాప్తిస్మము, దానికి గల సంబంధములు

## ( Baptism and its Relationships )

నాకు తెలిసినంత మట్టుకు చాలామంది రక్షణ పొందడానికి బాప్తిస్మము అవసరమని నమ్మలేరు. మన ఆలోచనలను ఉద్దేశములను ఒక్కసారి పక్కన పెట్టి 'బైబిలు' ఏమి చెప్పుచున్నదో చూద్దాము. క్రొత్త నిబంధన బాప్తిస్మమును గూర్చి చదివినపుడు దానికి మిగత వాటితో గల సంబంధములను తెలిసికొనవచ్చును. ఉపసర్గ మనగా, ఒక వస్తువునుగానీ లేదా ఒక క్రియనుగాని దానికి ముందుగ నుంచబడిన "ఒక మాట". ఈ పాఠములలో మనము ఆ విధముగ నుంచబడిన మాటలను బాప్తిస్మమునకు సంబంధించినంత మట్టుకు పరిశీలిద్దాం.

## నీ టి లో

"లో" అనబడిది ఒక ఉపసర్గము. నీటిలో బాప్తిస్మము ఉన్నది. అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయములో ఐతియోపీయుడైన నపుంసకుడు నీటిలో బాప్తిస్మము పొందెను. అపొ. కార్యములు 10:47 లో "అందుకు పేతురు మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్ళను ఆటంకము చేయ గలడా అని చెప్పెను". క్రొత్త నిబంధనలో మనము వివిధ రకములైన బాప్తిస్మములను గురించి చదువవచ్చును. ఉదాహరణకు పరిశుద్ధాత్మ వలన బాప్తిసము, అగ్నివలన బాప్తిస్మము మొదలైనవి. కానీ ఈరోజు మనకు ఒక నీటి బాప్తిస్మము కలదు. ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 4 : 5లో మనకు బాప్తిస్మము ఒక్కటే అని చెప్పబడినది. ఆ ఒక్క బాప్తిస్మము ఏదనగా దేవుని సంఘములోనికి బాప్తిస్మము. యేసు ఈలాగు చెప్పెను. "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగ చేయుడి. తండ్రి యొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ

యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు, నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నింటిని గైకొనవలెనని వారికి బోధించుడి (మత్తయి 28:19, 20). ఈ యుగసమాప్తి వరకు ఈ బాప్తిస్మమును అమలు పరచవలెను మరియు మనుష్యునిచే యిది చేయబడవలెను. ఈ బాప్తిస్మమే నీటిలోని బాప్తిస్మము.

బాప్తిస్మము, క్రీస్తునామము కూడ కలదు (అపొ. 2:38) క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుట అనగా ఆయన అనుమతితో బాప్తిస్మము పొందుట.

## నీటి ద్వారా

"ద్వారా లేక యందు" అనబడినది కూడా మరియొక ఉపసర్గము. 1 కొరింథీ 12:13 లో మన మీలాగున చదువగలము. మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. ఆత్మయందు లేదా ఆత్మచేత బాప్తిస్మము పొందుట యనగా, పరిశుద్ధాత్మ బోధించిన విధముగ బాప్తిస్మము పొందుట. క్రీస్తు ఆయన మరణమునకు ముందు ఆయన అపొస్తలులకు మరియు ఆయనను నమ్మిన వారికి వారి బోధలలో నడిపించుటకు మార్గము చూపుటకొరకు పరిశుద్ధాత్మను పంపిస్తానని వాగ్దానము చేసెను. ఈ మనుష్యులు తాము పరిశుద్ధాత్మచేత నడిపింపబడగా వ్రాసిరి, లేదా పలికిరి. గనుక పరిశుద్ధాత్మ ప్రేరేపణచే వ్రాయబడిన గ్రంథము "బైబిలు" మనకు ఉన్నది. ఈ విధముగా వ్రాయబడిన వాక్యము ద్వారా పరిశుద్ధాత్మ మనకు బోధించును, మనము బాప్తిసము పొందవలెనని చెప్పును. క్రొత్త నిబంధనలో బాప్తిస్మము గూర్చిన విషయములను మనము పాటించినట్లయితే మనము పరిశుద్ధాత్మచేత అలాగున చేయుచున్నాము.

## పాపక్షమాపణ నిమిత్తము

"నిమిత్తము అనునది మరియొక ఉపసర్గము. యిదికూడా బాప్తిస్మమునకు సంబంధించినదే. అపొ. కా. 2:38లో మన పాపముల నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని చదువగలము. "నిమిత్తము" "అను మాటకు" గురించి అని అర్థము. మన పాపములు క్షమించ బడుట గురించి మనము బాప్తిస్మము పొందవలెను. అపొ. కా. 22:16లో పౌలుతో బోధకుడు చెప్పిన విధముగ యిది యున్నది. "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి, బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని చెప్పెను".

## ఒక్క శరీరములోనికి

"లోనికి" అనునది మరియొక ఉపసర్గము. యిది కూడా బాప్తిస్మమునకు సంబంధించి పలుమార్లు వాడబడినది. (1 కొరింథీ 12:13). "మనము ఒక్క శరీరములోనికి బాప్తిస్మము పొందితిమని" వ్రాయ బడి యున్నది. ఆ ఒక్క శరీరము ఆయన సంఘము. కనుక ఆయన శరీరమనబడిన క్రీస్తు సంఘములోకి రావలెనంటే బాప్తిస్మము అవుసరము.

తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మము పొందుట (మత్తయి 28:19). యిక్కడ మనము దేవునిలో గల మూడు వ్యక్తిత్వములను చూడ గలము. అందుచేత మనము ఈ మూడు నామములలోనికి బాప్తిస్మము పొందుదుము.

రోమా 6:3లో క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని వ్రాయ బడినది. మన మెప్పుడైతే క్రీస్తు మరణములోనికి బాప్తిస్మము పొందు తామో అప్పుడు మనము పాపములయెడల మరణిస్తాము అని పౌలు చెప్పుచున్నాడు. గలతీ 3:27లో మనము క్రీస్తులోనికి బాప్తిస్మము

పొందినట్లు వ్రాయబడినది. దయచేసి నిన్ను ఈ ప్రశ్న అడగనివ్వు: నీవు క్రీస్తు నామమున, పరిశుద్ధాత్మ నామమున, పాపక్షమాపణ నిమిత్తం, ఒక్క శరీరములోనికి, తండ్రియొక్క నామమున, కుమారుని యొక్క నామమున, పరిశుద్ధాత్మ యొక్క నామమున క్రీస్తు మరణము లోనికి, క్రీస్తులోనికి ఎప్పుడైనా నీటిలో బాప్తిస్మము పొందినావా?

—రోయ్ బీస్లే.

---

## కాకినాడలో బైబిలు సెమినార్

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆధ్వర్యమున 1988 డిశంబరు 10 నుండి 16 వరకు రెండో బైబిలు సెమినార్ కాకినాడలో జరిగించ బడినది. యిది దేవాలయం వీధిలో పైండావారి విశాలమైన కళ్యాణ మండపములో నిర్వహించబడినది.

ఈ సెమినార్‌లో అమెరికా దేశములో ప్రఖ్యాతి గాంచిన సువార్తికుడగు Bro. పెర్రి కోతమ్‌గారు వాక్యోపదేశము జరిగించారు. ఆయన 75 సంవత్సరముల వృద్ధుడయినను రోజుకు మూడుసార్లు గంభీరమైన వాక్యోపదేశము జరిగించారు. పెర్రి కోతమ్‌గారి ప్రసంగాలను వినడానికి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాలవారు, పొరుగు రాష్ట్రాలనుండి మరికొందరు సోదరులు విచ్చేసారు. కోతమ్‌గారు అనర్గళంగా వాక్యాన్ని ఉపదేశిస్తూ బైబిలులోని నిగూఢ సత్యాలను అతి సులువుగా ప్రబోధించారు. ఆయన అమెరికాదేశ మందంతటా క్రీస్తు సువార్తను ప్రకటించుటయే గాక, ప్రపంచములోని 70 దేశాలలో కూడ సత్యసువార్తను ప్రకటించారు.

ఈ బైబిలు సెమినార్‌కు ఇంచుమించు రెండు వేలమంది హాజరయ్యారు. ప్రతి కూటానికి హాలు అంతా జనంతో క్రిక్కిరిసిపోయేది.

నిజానికి కొన్ని నిమిషములు ఆలస్యంగా వచ్చిన వారికి సీట్లు దొరికేవి కావు. కూటములకు హాజరైన ప్రతివారు చివరివరకు కూర్చొని నిశ్శబ్ద వాతావరణంలో దేవుని వాక్యోపదేశము పొందారు. స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌వారు తయారుచేసిన ప్రత్యేక కీర్తనల పుస్తకం సెమినార్‌లో వినియోగించబడింది. వందలాది క్రైస్తవులు తమ స్వరముల నెత్తి దేవునికి స్తుతిగానము చేయుచుంటే ఎంతో వినసొంపుగాను, ఆత్మకు ఆనందదాయకంగాను ఉండేది.

కూటములకు హాజరైన వందలాది సోదర సోదరీలకు చక్కని భోజనం, వసతులు ఉచితంగానే ఏర్పాటు చేయబడినవి. కళ్యాణ మండప ఆవరణలో యున్న అనేక విశాలమైన గదులు, సాంబమూర్తి వీధిలోని బెయిలీ బిల్డింగ్, మరియు జిల్లాపరిషత్ వారి సత్రము కూడ వసతికొరకు వినియోగించబడింది. భారతదేశంలో క్రీస్తు సంఘములు ఇంత భారీ ఎత్తున ఏర్పాట్లు చేయడం యిదే మొదటిసారి. యిది భావిలో అనేక యిట్టి కూటములకు నాంది కాగలదనే నిరీక్షణ, విశ్వాసము సహోదరులందరిలోను కలిగింది.

స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టరు Bro. నెహెమ్యా గూటంగారు అన్ని ఏరాట్లు ముందుగానే సంకల్పించి ఎక్కడ యేమీ కొరత లేకుండ సమస్తము సక్రమంగాను, మర్యాదకరంగాను జరిగేట్లు చేసారు. ఆయన వ్యక్తిగత శ్రమ ఫలితంగా వందలాది క్రైస్తవ సోదర సోదరీలు చక్కటి ఆత్మీయ సహవాసాన్ని పంచుకోగలిగారు. దూరప్రాంతములనుండి వచ్చిన అనేకులు ఒండొరులకు మిత్రులయ్యారు.

డిశంబరు 16వ తేదీ శుక్రవారం మధ్యాహ్నంతో బైబిలు సెమినార్ ముగించబడింది. ఆఖరు కూటం అయిపోయిన తరువాత Bro. పెర్రి కోతమ్‌గారు కూటములకు హాజరైన ప్రతివారికి ఒక్కొ

బైబిలును బహూకరించారు. ప్రతిరోజు కూటం అనంతరం, వాక్యాన్ని విని విశ్వసించి మారుమనస్సు పొంది క్రీస్తును ఒప్పుకొన్నవారు బాప్తిస్మము పొందేవారు. ఆ విధంగా ఆ ఆరురోజులలోను 114 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందారు; సంఘముతో చేర్చబడ్డారు.

ఈ ద్వితీయ బైబిలు సెమినార్‌లో అమెరికాలోని రేట్‌వున్ సంఘ పెద్దలలో ఒకరైన Bro. జిమ్ ట్రోటరుగారు పాల్గొన్నారు. కూటములు ఆరంభమైన మొదటిరోజున ఆయన చక్కటి వాక్యపరిచర్య చేసారు. ఆరోజున N. ప్రసాదరావ్‌గారు, M. ఆల్‌ఫ్రెడ్‌గారు కూడ వాక్య పరిచర్యలో సహాయపడ్డారు. Bro. జిమ్ ట్రోటర్‌గారు అనేక సువార్తికులను కలసికొని వారి యోగక్షేమములు తెలిసికోగలిగారు. ఇట్టి బైబిలు సెమినార్లు, లెక్చర్‌షిప్పులు తరుచు జరిగితే చాల బావుంటుందని ఆయన తన ఆశను వెల్లడి చేసారు.

బైబిలు సెమినార్‌కు వచ్చిన ప్రతివారికి స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టరుగారు సత్యవాక్కు ద్వారా వందనములు తెలియజేయుచున్నారు. కాకినాడలోను, ఆంధ్ర అంతటిలోను, నిజానికి భారతదేశం అంతటిలోను క్రీస్తుసంఘం ఇంకా బలపడి ఆత్మీయంగా ముందుకు పోవాలనే ప్రార్థనలో మీరందరు మాతో ఏకీభవించ మనవి.

—సత్యవాక్కు సంపాదకులు.

## “మీరు నన్ను ప్రేమించిన యెడల....”

### “*If you love me...*”

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను

(యోహాను 3:16). తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువాని కంటె ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేడు (యోహాను 15:13). దేవుని కృప వలన ఆయన ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవించునట్లు దేవదూతలకంటె కొంచెము తక్కువవాడుగా చేయబడిన యేసు మరణము పొందినందున మహిమ ప్రభావములతో కిరీటము ధరించిన వానిగా ఆయనను చూచుచున్నాము (హెబ్రీ 2:9).

పై వాక్యములను గమనించినచో మనలను దేవుడు ఎంతగా ప్రేమించెనో గ్రహించగలము. యేసుప్రభువు మనలో ప్రతి ఒక్కని కొరకు మరణము అనుభవించినాడు. క్రీస్తుప్రభువు కల్వరి సిలువలో తన రక్తము కార్చి మన పాపముల కొరకు బలి అయినాడు. ఇంతగా మనలను ప్రేమించిన యేసుక్రీస్తును మనము కూడా ప్రేమింప బద్ధులమై యున్నాము. ప్రేమ అనగా ఏమిటో బైబిలులో స్పష్టముగా నిర్వచింపబడినది. "మన మాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట" (1 యోహాను 5:3). "మన మాయన ఆజ్ఞల ప్రకారము నడచుటయే ప్రేమ" (2 యోహాను : 6). యేసు యిలా అన్నాడు- మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు (యోహా 14:15). ఒకడు నన్ను ప్రేమించిన యెడల, వాడు నా మాట గైకొనును, అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించును. మేము వాని యొద్దకు వచ్చి వానియొద్ద నివాసము చేతుము (యోహాను 14:23). ఇందును బట్టి దేవుని ప్రేమించాలి. అనగా ఆయన ఆజ్ఞలను అనుసరించి నడవాలి అని స్పష్టముగా గ్రహించగలము. ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు అని వాక్యము చెప్పుచున్నది.

ఒక ధర్మశాస్త్రోపదేశకుడు ఆయనను శోధించుచు బోధకుడా ధర్మశాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ ఏదని అడిగెను. అందుకాయన నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ మనస్సుతోను

నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెననునదియే. ఇది ముఖ్యమై నదియు మొదటిదియునైన ఆజ్ఞ అని యేసు చెప్పెను. మనము దేవుని ప్రేమించాలంటే ఆయన ఆజ్ఞలను గైకొనవలెను. దేవుడు మననుండి విధేయతను కోరుచున్నాడు. ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడా పరలోకమునుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని ఎరుగని వారికిని మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమ పరచు వానికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడా విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే (2 థెస్స 1:6-8). అనగా దేవుడు అవిధేయులకు ప్రతిదండన చేయును. దేవుని ఉగ్రతను తప్పించుకొనాలంటే దేవుని ఆజ్ఞలను గైకొనడము ఎంతైనా అవసరము. యేసుక్రీస్తు పాపులకు మరియు క్రైస్తవులైన తన బిడ్డలకు కొన్ని ఆజ్ఞలు ఇచ్చినారు. వాటిని విడిగా పరిశీలించుదము.

**పాపులకు ఆజ్ఞలు** (Commands to sinners) :— సువార్త వినాలి (Hear the Gospel) : యేసు-ఈ నా మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడు బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును (మత్తయి 7:24). వినుట వలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును (రోమా 10:17). ఒక పాపి రక్షింపబడాలి అంటే మొట్టమొదట దేవుని వాక్యము వినాలి, విశ్వసించాలి, దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను (హెబ్రీ 11:6). యేసు చెప్పెను - దేవునియందు విశ్వాసముంచుచున్నారు నా యందును విశ్వాసముంచుడి. తండ్రియందు నేనును, నాయందు తండ్రియు ఉన్నామని నమ్ముడి (యోహాను 14:1, 11). కావున రక్షింపబడాలి అంటే రెండవదిగా దేవునియందును దేవుని కుమారుడైన యేసుక్రీస్తునందును విశ్వాసముంచాలి.

మారుమనస్సు పొందాలి (Repent) :— ఆ అజ్ఞానకాలమును దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని ఆజ్ఞాపించుచున్నాడు. మారుమనస్సు పొందడము దేవుని ఆజ్ఞకు విధేయులు కావడము. అందుచేత రక్షింపబడుటకు వాక్యము విని విశ్వసించిన పిదప మారుమనస్సు పొందాలి.

ఒప్పుకోలు (Confess):-యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు (రోమా 10:9). యేసు ఇలా అన్నాడు. నన్ను మనుష్యులయెదుట ఒప్పుకొనువాడెవడో మనుష్య కుమారుడు దేవుని దూతలయెదుట వానిని ఒప్పుకొనును. మనుష్యుల యెదుట నన్ను ఎరుగననువానిని, నేనును ఎరుగనని దేవుని దూతల యెదుట చెప్పుదును (లూకా 12:8, 9).

బాప్తిస్మము పొందాలి (Be-Baptised) :— పైన వ్రాసిన నాలుగు క్రియలు చేసినంత మాత్రాన పాపక్షమాపణ కలుగదు గాని బాప్తిస్మములో పాపములు క్షమింపబడును. పేతురు యిట్లు చెప్పెను - మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి (అపొ. 2:38). యేసు చెప్పెను-నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును (మార్కు 16:16). గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములు కడిగి వేసికొనుము (అపొ. 22:16). ఈ వాక్యములను పరిశీలించినచో, బాప్తిస్మము వలన పాపక్షమాపణ కలుగుతుందని గ్రహించవచ్చును. ఈ క్రియలు చేసి రక్షింపబడి, నమ్మకమైన జీవితము జీవించి నిత్యజీవము పొందుడని దేవుడు ఆజ్ఞాపించినాడు.

క్రైస్తవునికి ఆజ్ఞలు (Commands to Christian)

మీ శరీరములను సమర్పించుకొనుడి (Present your bodies) :—కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అను

కూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతన మగుట వలన రూపాంతరము పొందుడి (రోమా 12 : 1-2).

లోకమును ప్రేమింపకుడి (Love not the world) :— ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించినయెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపు డంబమును తండ్రివలన పుట్టినవి కావు. అవి లోకసంబంధమైనవే (1 యోహాను 2:15-17).

ఒకరినొకరు ప్రేమించుడి (Love one another) :—యేసు చెప్పెను. మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను. నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను (యోహాను 13:34). దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడా ప్రేమింపవలెనను ఆజ్ఞను మన మాయనవలన పొందియున్నాము (1 యోహాను 4:21).

మీకు మీరే పగ తీర్చుకొనకుడి (Avenge not yourselves) :— ప్రియులారా, మీకు మీరే పగతీర్చుకొనక దేవుని ఉగ్రతకు చోటియ్యుడి - పగ తీర్చుట నాపని. నేను ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది. కాబట్టి నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము. దప్పిగొనియుంటే దాహమిమ్ము; ఆలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు (రోమా 12:19-20).

స్థిరులుగా ఉండుడి (Be ye stead fast):— కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని

యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులై యుండుడి (1 కొరింథీ 15:58).

చందా పోగుచేయుడి (Lay by in store) :— పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే... నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను,

ప్రియ స్నేహితుడా! సోదరీ! నీవు దేవుని ప్రేమించుచున్నావా! ఆయన ఆజ్ఞలను గైకొనుచున్నావా? లేనిచో నేటినుండి ఆయన ఆజ్ఞలను గైకొనుమని క్రీస్తు నామమున బ్రతిమాలుచున్నాను. ఈ సత్య వాక్యములు మీ ఆధ్యాత్మిక జీవితములకు మేలు కరముగా యున్నవని నమ్ముచున్నాము. దేవుడు మిమ్మును ఆశీర్వదించునుగాక!

— V.J. జాంసన్, హైదరాబాద్.

---

Regd. No. H/KD—45/KD.H.O.

From
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To

............................................................

............................................................

............................................................

............................................................